సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 31 । మార్చి । 2024



**మట్కాపై ఉక్కుపాదం..**
జిల్లాలో మట్కా నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. ఇటీవల పట్టుబడిన నగదు, ఇతర వివరాలను ఆయన వెల్లడించారు. 8లో▸

**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| ఆది : 6:31 | సోమ : 4:48 |

గరిష్ఠం/కనిష్ఠం
40.0/29.0

**వాతావరణం**
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

## న్యూస్‌రీల్

### మానవ హక్కులకు భంగం కలిగిస్తే దృష్టికి తేవాలి



నియామక పత్రం అందజేస్తున్న చంద్రశేఖర్

ఎదులాపురం: మానవ హక్కులకు భంగం కలిగిస్తే తమ దృష్టికి తీసుకురావాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా నూతన అధ్యక్షుడు పోడం చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధితులకు అండగా ఉండి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గ వివరాలు వెల్లడించారు. మహిళా రక్షణ కమిటీ ఉపాధ్యక్షురాలుగా ఎస్.రాధ, ఆదిలాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా గంట ప్రమోద్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా సునంద, కార్యనిర్వాహక సభ్యుడిగా విశాల్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా కవితను నియమించినట్లు తెలిపారు.

### దినసరి కూలి రూ.600 అందించాలి



మాట్లాడుతున్న రాఘవులు

ఎదులాపురం: ఉపాధి హామీ కూలీలకు దినసరి కూలి రూ.600 అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లంక రాఘవులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో కూలీలకు సరైన కూలి లభించడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు నెలకు రూ. 18వేల వేతనం ఇవ్వాలని, ఈ లెక్కన సగటున రోజు కూలీ రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 200 రోజుల పని దినాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కూలి వెంటనే విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇందులో నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

### ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ పావని ప్రకటనలో తెలి పారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

'పది' మూల్యాంకనం నిర్వహించనున్న జోసెఫ్ కాన్వెంట్ ఉన్నత పాఠశాల




# స్పాట్‌కు సిద్ధం

- జిల్లాకు చేరిన లక్షా 90వేల జవాబు పత్రాలు
- ఏప్రిల్ 3నుంచి 'పది' మూల్యాంకనం ప్రారంభం
- 1,054 మంది ఉపాధ్యాయులకు విధులు

ఆదిలాబాద్‌టౌన్: పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ పాఠశాలలో స్పాట్ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3 నుంచి ఈ ప్రక్రియ కొనసాగునుంది. పది జిల్లాలకు సంబంధించి లక్ష 90వేల జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయి. మూల్యాంకన కేంద్రంలో అధికారులు కోడింగ్ చేస్తున్నారు. శనివారంతో పది పరీక్షలు ముగిశాయి. జవాబు పత్రాలను మూల్యాంకనం చేసేందుకు ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. సకాలంలో వాల్యూయేషన్ పూర్తయ్యేలా అదనంగా 30శాతం మందిని నియమించినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

**1,054 మంది నియామకం**
మూల్యాంకనం కోసం ఉపాధ్యాయులకు విధులు కేటాయిస్తూ డీఈవో ప్రణీత ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 1,054 మందికి స్పాట్ విధులు కేటాయించారు. ఇందులో 694 మందిని ఏఈలుగా, 123 మంది సీఈలుగా, 230 మందిని స్పెషల్ అసిస్టెంట్లుగా, ఏడుగురిని ఏసీవోలుగా నియమించారు. క్యాంప్ అధికారిగా డీఈవో, డిప్యూటీ క్యాంపు అధికారులుగా విద్యాశాఖ ఏడీ, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వ్యవహరిస్తారు. సాంఘిక శాస్త్రం మినహా మిగతా పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాలు మూల్యాంకన కేంద్రానికి చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు వాల్యూయేషన్ చేపట్టనున్నారు.

**ఏర్పాట్లలో అధికారులు**
మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లో మూల్యాంకనం జరుగనుంది. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఫ్యాన్లు, కూలర్లు, చల్లని తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. మూల్యాంకనం జరిగే సమయంలో తరగతి గదుల్లో చీకటి ఉండకుండా ప్రత్యేకంగా ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన పేపర్లను డిగ్రీ చదువుతున్న విద్యార్థుల ద్వారా కోడింగ్ చేయించి వేర్వేరుగా భద్రపరుస్తున్నారు. ఈ కోడింగ్ గదుల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. మూల్యాంకన ప్రక్రియను పరిశీలించేందుకు ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

> **పకడ్బందీగా నిర్వహిస్తాం**
> పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని పకడ్బందీగా నిర్వహిస్తాం. వివిధ జిల్లాల నుంచి జిల్లాకు 1.90లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. వాటిని స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచాం. మూల్యాంకనం చేసేందుకు 1054 మంది ఉపాధ్యాయులను నియమించాం. వారంతా తప్పనిసరిగా విధులకు హాజరుకావాలి. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారిని రిలీవ్ చేయాలి. ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.
> – ప్రణీత, డీఈవో

### 'పది'ంతల ఆనందం



పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఈ నెల 18న ప్రారంభం కాగా శనివారం సాంఘిక శాస్త్రం చివరి పరీక్ష నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నా రు. ఈ ఏడాది నుంచి ఏడు పేపర్లతో పరీక్షలు కొనసాగాయి. 10,404 మంది విద్యార్థులకు గాను 10,361 మంది హాజరయ్యారు. 43 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. చివరి పరీక్ష ముగిసిన వెంటనే కేరింతలు కొడుతూ కేంద్రా ల నుంచి బయటకు వచ్చారు. వసతిగృహాలు, ప్రైవేట్ హాస్టళ్లలో ఉండి చదువుకునే విద్యార్థులు సొంతూళ్లకు కుటుంబీకులు, బంధువులతో కలిసి పయనమయ్యారు. ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. ఏప్రిల్ 3నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం జరుగనుంది. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో ఈ 'స్పాట్' కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
– ఆదిలాబాద్‌టౌన్

# సీ–విజిల్‌పై విస్తృత ప్రచారం కల్పించాలి

- వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తదితరులు

కైలాస్‌నగర్: సీ–విజిల్ యాప్‌పై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి ఆయా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. సీ–విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సువిధలో దరఖాస్తు చేసుకున్న వారికి జాప్యం లేకుండా నిర్దేశించిన సమయంలోగా అనుమతులు జారీ చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరికీ ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. అలాగే 1950 టోల్ ఫ్రీనంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

# కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఎంసీఎంసీ కమిటీ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ప్రలోభాలు నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. చెక్ పోస్టుల్లో అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. 24గంటలపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిఘా ఉంచాలని ఆదేశించారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లేవారు తగిన ఆధారాలు చూపించాలని లేని పక్షంలో సీజ్ చేయడం జరుగుతుందన్నారు. మోడల్ కోడ్ కండక్ట్ ఉల్లంఘనలకు పాల్పడితే ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం తగిన చర్యలు తప్పవన్నారు.

**స్వీప్ ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలి**
18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవడంతో పాటు దాన్ని వినియోగించుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వీప్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేసేలా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెరిగేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, స్వీప్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సుశీలమ్మ సేవలు అభినందనీయం



సుశీలను సన్మానిస్తున్న డీఆర్డీవో సాయన్న, అధికారులు

కైలాస్‌నగర్: 33 ఏళ్ల సర్వీస్‌లో చిన్న పొరపాటుకు తావివ్వకుండా సుశీలమ్మ అందించిన సేవలు అభినందనీయమని డీఆర్డీవో జి.సాయన్న అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఏర సుశీలను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్డీవో, ఉద్యోగులు, సిబ్బంది ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మర్యాద పూర్వకంగా డీఆర్డీవో వాహనంలో ఇంటి వద్దకు సాగనంపి వీడ్కోలు పలికారు. ఆమె సేవలను కొనియాడారు. శేష జీవితం కూడా సాఫీగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీడీ జాదవ్ శేష్ రావు, ఏవో సంజయ్ కుమార్, డీపీఎంలు గంగన్న, హేమలత, శోభారాణి, సుగంధ, ఉద్యోగులు కిరణ్ కుమార్, ప్రకాశ్, కిరణ్, సవిత, లత పాల్గొన్నారు.

# 'ఉపాధి'.. ఊరట

- కూలి రూ.28 పెంచిన కేంద్రం
- ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి
- జిల్లాలో 2లక్షలకు పైగా కూలీలకు లబ్ధి

| జిల్లాలో.. |
|---|
| మొత్తం జాబ్‌కార్డులు : 1.72లక్షలు |
| నమోదు చేసుకున్న కూలీలు : 3.45లక్షలు |
| పనులకు వచ్చే కూలీలు : 2.17లక్షలు |
| పనిదినాల లక్ష్యం : 36.58 లక్షలు |
| పనుల విలువ: రూ.85.90 కోట్లు |



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కైలాస్‌నగర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారికిచ్చే కూలి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఎండల తీవ్రత అధికంగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతుంటాయి. ఈ సమయంలో పనులకు వచ్చే కూలీలకు ప్రయోజనం కలిగించేలా గతంలో కేంద్రం అదనపు భత్యం చెల్లించేది. అయితే రెండేళ్లుగా ఈ భత్యాన్ని నిలిపివేసింది. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలకు ఆర్థిక భరోసా కల్పించేలా వారికిచ్చే కూలి రూ.28 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1నుంచి అమలు చేయాలని భావిస్తోంది. కేంద్రం తాజా నిర్ణయంతో జిల్లాలోని లక్షలాది మంది కూలీలకు మేలు చేకూరనుంది.

**కూలి రూ.28 పెంపు**
వలసలు అరికట్టి గ్రామాల్లోని కూలీలకు స్థానికంగానే వంద రోజుల పాటు పని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) పథకాన్ని ప్రవేశపెట్టింది. కూలీలకు జాబ్‌కార్డులు జారీ చేసి వాటి ఆధారంగా పనులు కల్పిస్తున్నారు. పథకం ప్రారంభంలో రోజు వారీ కూలి రూ.87.50గా చెల్లించేవారు. నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో కూలీలకు లబ్ధి చేకూర్చేలా కూలి క్రమంగా పెంచుతూ వస్తోంది. 2022లో రూ.12 పెంచగా, 2023లో రూ.15 పెంచారు. తాజాగా రూ.28ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు వచ్చే ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయనున్నట్లుగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రోజువారీ కూలి రూ.272 చెల్లిస్తున్నారు. తాజా పెంపుతో జిల్లాలో 2.27లక్షల మంది కూలీలకు ఆర్థిక ప్రయోజనం కలుగనుంది.

**భత్యానికి బదులుగా ..**
ఉపాధి హామీ పనులు సాధారణంగా ఏటా ఏప్రిల్, మే నెలల్లోనే ముమ్మరంగా సాగుతుంటాయి. వ్యవసాయ పనులు ఉండకపోవడంతో గ్రామాల్లోని కూలీలకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో రాళ్ల కట్టలు, సాగునీటి వనరులకు సంబంధించి కాలువల్లోని పూడిక తీత పనులు, చేలల్లో కుంటల నిర్మాణం వంటివి జరుగుతున్నాయి. ఈ పనులకు హాజరయ్యే కూలీలకు అవసరమైన పార, గడ్డపార, తట్టల కొనుగోలు కోసం కేంద్రం గతంలో అదనపు భత్యం చెల్లించేది. అయితే రెండేళ్లుగా నిలిపివేసింది. అందుకు బదులుగా కూలి పెంచుతూ వస్తోంది. తాజా పెంపుతో కూలి రూ.300 వరకు చేరింది.

> **కూలీలకు ప్రయోజనకరం**
> 
> ఉపాధి కూలీలకు అందించే కూలిని మరో రూ.28 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1నుంచి అమల్లోకి రానుంది. ఈ నిర్ణయంతో ఉపాధి కూలీలకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. ఈ అవకాశాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలి.
> – కుటుంబరావు, ఏపీడీ

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు
- కలెక్టర్ రాజర్షి షా
- ఎండల తీవ్రతపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి అన్నారు. ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎండల తీవ్రత, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పంచాయతీశాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలోని ప్రధాన రద్దీ ప్రాంతాల్లో తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఇందుకోసం ఎన్జీవోల సహకారం తీసుకోవాలన్నారు. ఆయా మండల కేంద్రాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి మూగ జీవాలకు పశుగ్రాసం, తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ప్రథమ చికిత్స కిట్లతో పాటు సెలైన్లను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలకు తావులేకుండా పది మంది ఉద్యోగులు పనిచేసే వ్యాపార సంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లలో అగ్నిమాపక పరికరాలు పనిచేసేలా తనిఖీలు నిర్వహించాలని అగ్నిమాపకాధికారిని ఆదేశించారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

**ఉట్నూర్‌రూరల్:** ఒంటరి తనం భరించలేక మనస్తాపానికి గురై డిగ్రీ విద్యార్థి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది.. ఎస్సై మనోహర్ వివరాల ప్రకారం.. మండలంలోని లక్సెట్టిపేట గ్రామానికి చెందిన మేఘశ్యాం కుమారుడు అర్క వినోద్ (23) ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో వారు శుభకార్యానికి వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా వినోద్ దూలానికి వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి సోదరుడు గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి

**జైనథ్:** మండలంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన కాట్పెల్లి వామన్ రెడ్డికి చెందిన ఎద్దు మేతకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. స్థానికులు బాధితుల కథనం మేరకు... వామన్‌రెడ్డి ఎద్దు సాంగ్వి శివారులోని పూంద్రు ప్రవీణ్ చేనులో మేతమేస్తున్నాయి. చేను గట్టు మీద మేతమేస్తుండగా ఓ ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైతు సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించాడు. సుమారు రూ.50వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో లబోదిబోమన్నాడు. అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.










# పునరావాసం ఎప్పుడో..?

- ఇప్పటికీ ప్రతిపాదనల్లోనే గుండేగాం పరిస్థితి..
- మరో రెండు నెలల్లో వర్షాకాలం
- ఇంకా ఎదురుచూస్తున్న గ్రామస్తులు




**భైంసారూరల్:** గుండేగాం పునరావాసంపై స్పష్టత రావడం లేదు. ఏళ్ల సమస్యకు ఎక్కడ పరిష్కారం కనిపించడం లేదు. ప్రభుత్వం మారినా గుండేగాం సమస్య మాత్రం తీరడం లేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ గుండేగాం సమస్యపై ఎవరు స్పందించడం లేదు. పాత సర్వేలు, అవే ప్రతిపాదనలు మళ్లీమళ్లీ పంపిస్తున్న ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నిధులైతే రావడం లేదు. 2009 నుంచి ఇదే పరిస్థితి ఉన్న ఎవరు స్పందించడం లేదు. ఏళ్లుగా పునరావాస సమస్యకు పరిష్కారం చూపడం లేదు. ప్రతియేటా వర్షాకాలం ఆరంభంలో భారీ వర్షాలు కురియగానే గుండేగాం ఊరిలోకి బ్యాక్‌వాటర్ చొచ్చుకుపోవడం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు గుండేగాంలోకి రావడం పరామర్శించడం, వెళ్లడం ఆనవాయితీగా మారిపోయింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో గ్రామంలోని చాలా కుటుంబాలు పట్టణ సమీపంలోని కమలాపూర్ గుట్ట వద్ద నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో తాత్కాలిక ఆవాసం ఏర్పరుచుకున్నారు. శాశ్వత పరిష్కారం కోసం అంతా ఎదురుచూస్తున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలతో 81 కుటుంబాలు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలోనే నివసిస్తున్నాయి.

**సర్వేలకే పరిమితం...**

పల్సికర్ రంగారావు ప్రాజెక్టు నిర్మాణంతో గుండేగాం గ్రామం నీటమునిగింది. ప్రతియేటా వర్షాకాలంలో గ్రామం ముంపునకు గురవుతుంది. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఊరుమునగదని తేల్చారు. కానీ ప్రతియేట ప్రాజెక్టు నీటిలో గ్రామం మునిగిపోతుంది. భారీ వర్షాలు కురిసిన సమయం



వర్షాలకు గ్రామంలోకి చొచ్చుకువచ్చిన నీరు (ఫైల్)

లో వాగు పరివాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాల్లో నీరు నిలిచికనిపిస్తుంది. గ్రామంలో 162 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలకు సంబంధించిన 364 ఎకరాల పంట భూములు కూడా నీటమునుగుతున్నాయి. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా బతుకుతున్న గుండేగాంవాసుల ఇబ్బందులు తీరడంలేదు. ఏళ్లుగా ఈ సమస్యవెంటాడుతున్న పరిష్కారం దొరకడంలేదు.

**కొత్త ప్రభుత్వంపై ఆశలు...**

గుండేగాం వాసులు పునరావాసం కోసం కొత్త ప్రభుత్వంపైనే ఆశలు పెంచుకున్నారు. కొత్త ప్రభుత్వంలో తమ ఇబ్బందులు తీరుతాయని అంతా భావిస్తున్నారు. గుండేగాం గ్రామానికి పునరావాసం కల్పిస్తే శాశ్వత పరిష్కారం దొరకనుంది. పదేళ్లుగా గుండేగాం గ్రామస్తులు ఈ సమస్య పరిష్కారం కోసం రాష్ట్రంలో అప్పటి నాయకులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఎన్నోఏళ్లుగా సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతూనే ఉన్నారు. ప్రభుత్వ అధికారులు గుండేగాంపై దృష్టిసారిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకనుంది.

**అధికారులను కలిశాం**



గుండేగాం పునరావాసం కోసం అప్పట్లో కలెక్టర్, రాష్ట్ర మంత్రులను కలిశాం. అప్పట్లో గ్రామంలో చొచ్చుకొచ్చిన నీటి ఫొటోలను అధికారులకు పంపించాం. పునరావాసంపై వినతిపత్రాలు సమర్పించాం.

– అశోక్, గుండేగాం

**ప్రతిపాదనలు పంపించాం**

గుండేగాంలో ముంపునకు గురయ్యే ఇళ్లను గుర్తించాం. గతంలో గుండేగాం గ్రామంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వేలు జరిగాయి. అక్కడ ఎదురవుతున్న సమస్యలన్నింటిని సర్వే బృందం ఉన్నతాధికారులకు నివేదించింది. గుండేగాం సమస్య పరిష్కారం కోసం అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో కృషి చేయనుంది.

– ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్

# మట్కాపై ఉక్కు పాదం మోపుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

- తీరు మారకుంటే పీడీ యాక్ట్ నమోదు
- జిల్లా ఎస్పీ గౌస్ ఆలం

**ఆదిలాబాద్‌టౌన్:** జిల్లాలో మట్కా నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్యాశకు పోయి డబ్బులను పోగొట్టుకోవద్దని యువతకు, ప్రజలకు సూచించారు. ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్రకు ఆనుకొని ఉన్నందున జిల్లా సరిహద్దు అవతల వైపు ఉన్న నిందితులు జిల్లాలో తరచూ మట్కా నిర్వహించే ప్రయత్నం చేస్తున్నారని యువత, జిల్లా ప్రజలు మట్కాపై ఆకర్షితులు కాకుండా అడ్డుకోవడంలో జిల్లా పోలీసు వ్యవస్థ ముందుందని తెలిపారు. మట్కా నిర్వహిస్తున్న నిందితులను బైండోవర్ చేస్తూ అడ్డుకట్ట వేస్తున్నట్లు వివరించారు. మట్కా నిర్వాహకులపై పీడీ యాక్ట్ సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల దినచర్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గత ఏడాది 43 కేసులు నమోదు కాగా 116 మందిని అరెస్టు చేసి, రూ.6,54,660 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ ఏడాది 12 కేసుల్లో 41 మందిని అరెస్టు చేసి, దాదాపు రూ.లక్ష వరకు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**తొమ్మిది మంది అరెస్ట్..**

**రూ.32,50 స్వాధీనం..**

మట్కాను సమూలంగా నిర్మూలించేందుకు నడుం బిగించామని ఎస్పీ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా శనివారం జైనథ్, భీంపూర్ మండలాల్లో మట్కా స్థావరాలపై దాడులు నిర్వహించి రూ.32,750 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకుని, 9 మందిని అరెస్టు చేయగా, ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అలాగే జైనథ్ మండలంలో మట్కా స్థావరంపై దాడి చేసి సత్యనారాయణ (తలమడుగు), కిషన్ (తలమడుగు), సయ్యద్ రజి యుద్దీన్ (ఆదిలాబాద్)లను పట్టుకున్నామన్నారు. మరో నిర్వాహకుడు అశోక్ సామ్రాట్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి మట్కా చిట్టీలు, రూ.11,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా భీంపూర్ మండలంలో మట్కా స్థావరంపై దాడిచేసి మట్కా నిర్వాహకులు శ్యామ్‌రావు, మడావి దత్తు, రవీందర్, తొడసం బండు, షేక్ సాజిద్, ఆశిష్‌లను పట్టుకున్నామని, సంజీవ్ జైస్వాల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఏడుగురిపై భీంపూర్ పీఎస్‌లో కేసు నమోదు చేశామని, వారి నుంచి మట్కా చిట్టీలు, రూ 21,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సైలు ప్రదీప్‌కుమార్, వి.పురుషోత్తం ఉన్నారు.

# 'ఆదరించండి.. అభివృద్ధి చేస్తా'

**భైంసాటౌన్:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపించాలని, అందరి సలహాలు, సూచనలతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్‌ను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం తనపై నమ్మకంతో అభ్యర్థిగా ప్రకటించిందని, ఎన్నికల్లో తన గెలుపు కోసం అందరి సహకారం కావాలన్నారు. మహిళనైన తనను ప్రతీ ఒక్కరు ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపాలని, తద్వారా ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకకు అవకాశమివ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యనాయకులు శంకర్ చంద్రే, ఓంప్రకాశ్ లడ్డా, రాజన్న, రాంచందర్‌రెడ్డి ఉన్నారు.

**ఒక్కసారి అవకాశం ఇవ్వండి**

**నేరడిగొండ:** ఆదిలాబాద్ ఎంపీగా ఒక్కసారి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కోరారు. మండల కేంద్రంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ నివాసంలో పార్టీ నాయకులను కలిశారు. ఆడపడుచును ఆదరించాలని కోరారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆడె వసంత్‌రావు ఆధ్వర్యంలో ఆమెను పార్టీ నాయకులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఏఎంసీ అధ్యక్షుడు గంగారెడ్డి, జిల్లా నాయకులు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నేరడిగొండ: సుగుణను సన్మానిస్తున్న నాయకులు

# పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ కల్పించాలి

**ఎదులాపురం:** జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ కొరవడిందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరీశ్, గణేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఓ విద్యార్థిని పాము కాటుకు గురైందని, ఇటీవల ఉట్నూర్ మండలంలోని ఉట్నూర్ ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థి టేకం మాణిక్‌రావు విద్యుత్ షాక్‌కు గురయ్యాడని, అదే మండలం లక్సెటిపేట్ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి కొడప తుకారాం కాలు ప్యాక్చరైందన్నారు. ఈ ఘటనల్లో ఎలాంటి ప్రాణాపాయం సంభవించలేదన్నారు. చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సంఘటనలపై దృష్టి సారించి సంబంధిత పాఠశాలల బాధ్యులపై ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దత్తత్రి, జిల్లా కోశాధికారి నాగేందర్, జిల్లా కమిటీ సభ్యులు పూజ, నితీశ్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి గణేశ్

# రిమ్స్‌లో వైద్యుల నిర్లక్ష్యం

- గంటల తరబడి స్ట్రెచర్‌పైనే రోగి

**ఆదిలాబాద్‌టౌన్:** ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్న రిమ్స్ వైద్యుల తీరు మాత్రం మారడం లేదు. బేల మండలంలోని ఏటి గ్రామానికి చెందిన కోయిరే నత్తు తన రెండు కాళ్లు పక్షవాతంతో పనిచేయకపోవడంతో కుటుంబీకులు రిమ్స్ ఆసుపత్రికి ఉదయం 10 గంటలకు తీసుకువచ్చారు. అంబులెన్స్ సిబ్బంది అత్యవసర విభాగం వద్ద స్ట్రెచర్‌లో దించి వెళ్లారు. ఎమర్జెన్సీ వార్డులోని సిబ్బంది పాత భవనంలోకి తీసుకెళ్లాలని కుటుంబీకులకు సూచించారు. దీంతో రోగిని అక్కడికి తీసుకెళ్లగా ఇక్కడ కాదని అక్కడికే వెళ్లాలని తిప్పి పంపించారు. ఆ తర్వాత రిమ్స్‌లోని సిబ్బందికి చెప్పినా ఎవరు పట్టించుకోకుండా గంటల తరబడి తిప్పించారని బాధిత కుటుంబీకులు వాపోయారు. చివరకు రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బేల యువజన కాంగ్రెస్ నాయకుడు సామ రూపేష్‌రెడ్డి రిమ్స్ డైరెక్టర్‌ను సంప్రదించడంతో డైరెక్టర్ ఆదేశాల మేరకు సిబ్బంది బాధితుడిని ఆసుపత్రిలో చేర్చుకున్నారు. గంటల తరబడి స్ట్రెచర్‌లోనే పడుకున్నప్పటికీ వైద్యం అందకపోవడంతో కుటుంబీకులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.



స్ట్రెచర్‌పై పడుకుని ఉన్న రోగి

## రూ. 3,77,500 నగదు స్వాధీనం

**జైనథ్:** బేల నుండి జైనథ్ వైపు బైక్ పై వెళ్తున్న షేక్ అస్లం అనే వ్యక్తి నుంచి రూ.3,77,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం అధికారులు శ్రీనివాస్, శేషారావ్‌లు తెలిపారు. శనివారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో జాతీయ రహదారిపై జైనథ్‌కు కూతవేటు దూరంలో బైక్ ఆపి తనిఖీ చేయగా రసీదు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుని అస్లంపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న సిబ్బంది

## ఎమ్మెల్యే వాహనం తనిఖీ

**ఖానాపూర్:** మండలంలోని బాదన్‌కూర్తి చెక్‌పోస్టు వద్ద శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వాహనాన్ని ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఇన్‌చార్జి రవీందర్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సిబ్బంది నిర్భయంగా విధులు నిర్వహించడంపై వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై దేవ్, సిబ్బంది ఉన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది

# బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

- ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

**తాంసి:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతీ బీఆర్‌ఎస్ కార్యకర్త కృషి చేయాలని పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు కోరారు. శనివారం భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో సక్కు పర్యటించారు. నిపాని, భీంపూర్, అంతర్గాం గ్రామాల్లో నాయకులతో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన పథకాలను వివరించాలన్నారు. భారీ మెజార్టీ లక్ష్యంగా ఇంటింటా ప్రచారం చేపట్టాలని సూచించారు. జెడ్పీటీసీ సుధాకర్, నాయకులు రాజన్న, ముకుంద్ సంతోష్, కపిల్, రాంరెడ్డి ఉన్నారు.




మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

## పండ్ల తోటల వేలం

**ఉట్నూర్‌రూరల్:** ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉద్యాన నర్సరీలోని పండ్ల తోటల వేలం వేయనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా శనివారం తెలిపారు. ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యాన నర్సరీలో ఉన్న మామిడి, జామ తోటల ఫల సాయాన్ని ఏప్రిల్ 6వ తేదీన తోటలోనే వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యాపారులు మధ్యాహ్నం 3గంటలకు ఉట్నూర్ నర్సరీలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి, ఐటీడీఏ ఉద్యాన అధి కారి సుధీర్‌కుమార్ 9032313933 సంప్రదించాలని కోరారు.

## పలువురు ఆదివాసీ నేతలను కలిసిన సక్కు



వివరాలు ఆరా తీస్తున్న సక్కు

**ఆదిలాబాద్‌రూరల్:** జిల్లాలోని పలువురు ఆదివాసీ సంఘాల నాయకులను బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు శనివారం రాత్రి ఆదిలాబాద్‌లో కలిశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. తనను పార్లమెంట్‌కు పంపేందుకు మీ వంతుగా సహకారం అందిస్తే ఆదివాసుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయడం జరుగుతుందన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పలువురు ఆదివాసీలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసేవారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

